సాక్షి అనకాపల్లి

సోమవారం । 29 । మే । 2023



క్షీరాబ్ధిరస్తు

సాధారణ రోజుల మాదిరిగానే చిరికివాని పాలెం రైతు అచ్చింనాయుడు వేసవిలోనూ పాల దిగుబడి సాధిస్తున్నాడు. 8లో



పోటెత్తిన భక్తులు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. 8లో



ఈదురుగాలుల బీభత్సం

చోడవరం, గొలుగొండ, రావికమతం తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. 8లో

న్యూస్‌రీల్

హోంగార్డుకు రూ.లక్ష ఆర్థిక సాయం



రాజారెడ్డికి ఆర్థిక సాయం అందిస్తున్న పోలీసు సిబ్బంది

పాయకరావుపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు కె.రాజారెడ్డికి పోలీసులు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. రాజారెడ్డికి ఇటీవల కాకినాడ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ జరిగింది. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి సీఐ పి.అప్పలరాజు, ఎస్‌ఐలు రమేష్, జోగారావు, సిబ్బంది ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు.

విరబూసిన లక్ష్మీ కమలం



కనువిందు చేస్తున్న లక్ష్మీ కమలం

కోటవురట్ల: అరుదైన లక్ష్మీ కమలం పుష్పం ఓ ఇంట విరిసి కనువిందు చేసింది. మే ఫ్లవర్, బ్రహ్మకమలం కోవలోకి వచ్చే లక్ష్మీ కమలం సంవత్సరానికి ఒకసారి మాత్రమే వికసిస్తుంది. తంగేడుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత ఆర్.ఎస్.లక్ష్మీనరసింహరాజు ఈ మొక్క అంటును ఏడాది క్రితం సేకరించి ఇంటి పెరట్లో నాటారు. అది ప్రస్తుతం మొగ్గ తొడిగి పూవుగా విరబూసి విశేషంగా ఆకట్టుకుంటోంది. దీని శాస్త్రీయ నామం నెలంబో న్యూసిఫెరా. ఇది సాధారణంగా వాటర్ గార్డెన్స్‌లో పెరుగుతుంది. ఈ పుష్పం వియత్నాం దేశ జాతీయ పుష్పంగా ఉంది.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



డాక్టర్ కె.వెంకటరమణ

మురళీనగర్: రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. విద్యార్థులు వారి సమీప హెల్ప్ లైన్ కేంద్రంలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లాకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కౌన్సెలింగ్ ద్వారా సీటు పొంది, అర్హత కలిగిన వారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాల ద్వారా ఉచితంగా చదివిస్తుందని తెలిపారు.

ఐసీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్‌గా కృష్ణమాచారి

విశాఖ విద్య: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ సీఎంఏ పి.బి.కృష్ణమాచారి ఎన్నికయ్యారు. విశాఖపట్నం చాప్టర్ భవనంలో ఆదివారం ఐసీఏఐ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా సీఎంఏ ఏయు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామలింగారెడ్డి, కోశాధికారిగా ఎం.హిమబిందును ఎన్నుకున్నారు.

అచ్యుతాపురం అనకాపల్లి మార్గం సుగమం



విస్తరించనున్న అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి

- రూ.243 కోట్ల ఏడీబీ నిధులు మంజూరు
- కొలిక్కివస్తున్న భూసేకరణ ప్రక్రియ
- పనుల ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నిర్మాణ సంస్థ

అచ్యుతాపురం (అనకాపల్లి): జిల్లాలో కీలక రహదారిగా మారిన అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణకు చకచకా అడుగులు పడుతున్నాయి. ఒకపక్క భూసేకరణ ప్రక్రియ కొలిక్కివస్తుండగా.. రూ.243 ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నిధులు మంజూరు కావడంతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించడానికి మార్గం సుగమమవుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ తోసహా నిర్మాణ పనులకు మొత్తం రూ.350 కోట్లు అవసరం. పారిశ్రామికవాడల్లో రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఏడీబీ నిధులు మంజూరు చేసేందుకు 2016లో ఆమోద ముద్ర వేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఏడీబీ ఏపీకి కేటాయించిన రూ.1,116 కోట్ల రుణ మంజూరుకు ఈ నెల 28వ తేదీన పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. దీనిలో అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి నిర్మాణానికి రూ.243 కోట్లు కేటాయించనున్నారు.



రహదారి హద్దులకు మార్కింగ్ ఇస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్రంలోని రోడ్ల మరమ్మతుల అంశాన్ని రాజకీయం చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు చెక్ చెప్పేలా మెజారిటీ రహదారులు శరవేగంగా పూర్తయ్యాయి. కీలకమైన అచ్యుతాపురం–అనకాపల్లి రహదారిని విస్తరించే విషయంలో భూసేకరణ సంక్లిష్టంగా మారింది. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు, వివిధ రంగాల వారు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండగా భూమిని ఇచ్చే విషయంలో రైతులు పట్టుదల ప్రదర్శించారు. దీంతో ఆర్డీవో స్థాయి అధికారి అనకాపల్లి, జీపీ అగ్రహారం, నాగులాపల్లి, తోటాడ, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి రైతులతో దశల వారీగా చర్చలు జరిపారు. నిబంధనల మేరకు రైతులకు ప్రతిపాదించిన పరిహారానికి, ప్రస్తుత మార్కెట్ ధరకు చాలా వ్యత్యాసం ఉండటంతో ఈ అంశంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలో స్థానిక రైతుల డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 1,100 మందికి రూ.107 కోట్ల మేర పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో రెండు వర్గాల ఆకాంక్షలు నెరవేరనున్నాయి. రెండు వారాల్లో దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైతే రైతులకు పరిహారం అందడం, భూమిని ఆర్‌అండ్‌బీకి అప్పగించడం జరుగుతుంది.

ఇవీ ప్రత్యేకతలు

- రహదారి పొడవు 13.8 కిలోమీటర్లు
- 100 అడుగుల మేర నాలుగు వరుసల్లో రహదారి విస్తరణ
- రెండు బ్రిడ్జిలు, ఒక ఫ్లైఓవర్ నిర్మాణం
- నిర్మాణానికి రూ.243 కోట్లు
- భూసేకరణకు రూ.107 కోట్లు (ప్రతిపాదన)

రంగం సిద్ధం

పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్ ఈ అంశంలో చాలా శ్రద్ధ వహిస్తున్నారు. సుమారు 1100 మంది రైతులకు రూ.107 కోట్ల మేర పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. –చిన్ని కృష్ణ, అనకాపల్లి ఆర్డీవో

భూమి అప్పగించిన వెంటనే పనులు ప్రారంభం

అచ్యుతాపురం–అనకాపల్లి రహదారిని రూ.243 కోట్లతో 100 అడుగుల మేర విస్తరించనున్నాం. ప్రస్తుతం ఉన్న రహదారికి రెండు వైపులా అవసరమైన స్థలాన్ని అప్పగిస్తే పనులు ప్రారంభిస్తాం. –ప్రసాద్, బీవీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ జీఎం

బాలురే బైక్ దొంగలు

ఆ నలుగురు బాలురు జల్సాలకు అలవాటు పడ్డారు..సొమ్ము కోసం బైక్ దొంగతనాలను ఎంచుకున్నారు.. కనిపించిన బండిని మాయం చేసి అమ్మేస్తూ ఎంజాయ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- నలుగురు నిందితులు మైనర్లు
- బైక్‌లు కొనుగోలు చేసిన ఇద్దరి అరెస్టు
- వారి నుంచి రూ.8 లక్షల విలువైన 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో నమోదైన బైక్ చోరీ కేసులపై పోలీసులు ప్రత్యేకదృష్టి సారించారు. దీనిలో భాగంగా నర్సీపట్నం సీఐ గణేష్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు బాలురను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు జిల్లాలో పలు చోట్ల బైక్ చోరీలకు పాల్పడినట్టుగా గుర్తించారు.ఆ బైక్‌లను కొనుగోలు చేసిన ఇద్దరిని అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రూ.8లక్షల విలువైన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కె.మురళీకృష్ణ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

ప్రత్యేక బృందంతో తనిఖీలు

గత రెండు నెలల్లో నర్సీపట్నం సబ్ డివిజన్‌లోని నర్సీపట్నం టౌన్, రూరల్, మాకవరపాలెం, కొయ్యూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులపై ఎస్పీ మురళీకృష్ణ ప్రత్యేక దృష్టిసారించారు. నర్సీపట్నం ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నర్సీపట్నం సీఐ గణేష్‌తో పాటు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. వారు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నర్సీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బయపురెడ్డిపాలెం సమీపంలోని ఐటీఐ జంక్షన్–కసిమి రోడ్డు వైపు నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న నలుగురు బాలురు అనుమానాస్పదంగా కనిపించారు. పారిపోతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో నర్సీపట్నం టౌన్‌లో ఆరు, నర్సీపట్నం రూరల్‌లో 2, మాకవరపాలెంలో ఒకటి, కొయ్యూరులో ఒకటి, కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతంలో ఒక బైక్‌ను చోరీచేసినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మొత్తం రూ.8లక్షల విలువైన 11 ద్విచక్ర వాహనాలు దొంగిలించి వాటిని మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన రుత్తల వరహాలబాబు, కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన చీపురుపల్లి రాము అనే వ్యక్తులకు అమ్మినట్టు విచారణలో తేలింది. వారి నుంచి ఆ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రతిభ కనబరిచిన సిబ్బందికి అభినందన

చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు. కేసులు నమోదైన తక్కువ వ్యవధిలోనే రూ.8లక్షల విలువైన 11 వాహనాలను స్వాధీనం చేసుకున్న అనకాపల్లి సీసీఎస్ సీఐ నీలయ్య, ఎస్ఐ పి.రమేష్, ఇతర సిబ్బంది, నర్సీపట్నం టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గణేష్, ఇతర సిబ్బందిని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అభినందించారు. వారికి రివార్డులు ఇచ్చారు.

ఏటీఎం నుంచి భారీగా నగదు చోరీ

- రూ.15.17 లక్షల అపహరణ
- గతంలో ఇదే ఏటీఎంలో చోరీకి విఫలయత్నం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సుబ్బరాజు



ఏటీఎం కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న క్రైం పోలీసులు

అనకాపల్లి టౌన్: స్థానిక పూడిమడక రహదారిలో గల ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.15,17,300 నగదును దొంగిలించారు. గతంలో కూడా ఇదే ఏటీఎంలో చోరీకి విఫలయత్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రానికి రంధ్రం చేసి నగదు చోరీ చేశారని సమాచారం.

ఎస్ఎంఎస్‌తో బయటపడ్డ చోరీ

ఏటీఎం కేంద్రంలో నగదు లేనట్టు సీఎంఎస్ ప్రైవేటు సంస్థ సభ్యులకు ఆదివారం ఎస్ఎంఎస్ రావడంతో చోరీ జరిగిన విషయం బయటపడింది. దీంతో హుటాహుటిన బ్యాంకు అధికారులు ఏటీఎంను సందర్శించి, నగదు చోరీ జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సుబ్బరాజు పరిశీలించారు. సీఐ దాడి మోహనరావు కేసు నమోదు చేశారు. క్రైం క్లూస్ బృందం రంగంలో దిగింది. ఏటీఎంలో చోరీ జరిగిన తీరును పరిశీలించింది. అక్కడ ఉన్న సీసీ కెమెరాల పుటేజీలతో పాటు రహదారిపై ఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించింది. 2018 మార్చిలో ఈ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం జరిగింది. ఈ కేంద్రం వద్ద సెక్యూరిటీగార్డును ఏర్పాటు చేయాలని అప్పట్లో పోలీసులు సూచించినా బ్యాంకు అధికారులు పట్టించుకోలేదని సమాచారం. బ్యాంకు అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేసి ఉంటే ఇంతపెద్దమొత్తంలో చోరీ జరిగి ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.

నిర్మానుష్యంగా ఉండడంతోనే..

పూడిమడక రోడ్‌లో ఉన్న ఈ ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం అటు పట్టణానికి, ఇటు జాతీయ రహదారికి మధ్యలో ఉంటుంది. ఈ ప్రాంతం పగటి సమయంలో రద్దీగా ఉండడంతో ఈ ఏటీఎంలో ఎప్పుడూ నగదు ఎక్కువ మొత్తంలో ఉంటుంది. అయితే రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో జనసంచారమే ఉండదు. అందువల్లే దొంగలు ఈ ఏటీఎంను ఎంచుకుని చాలా సులువుగా చోరీ చేశారని భావిస్తున్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమ్స్

సీతంపేట (విశాఖ): సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 29 కేంద్రాలలో రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 10,864 మంది అభ్యర్థులకు గాను మొదటి సెషన్ పరీక్షకు 5,607 మంది, రెండో సెషన్ పరీక్షకు 5,536 మంది హాజరయ్యారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మొత్తంగా రెండు సెషన్లకు 51.28 శాతం పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులతో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తీరంలో 'సండే' సందడి



తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం తీరంలో సందర్శకులు ఆదివారం సందడి చేశారు. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉన్నప్పటికీ ఇక్కడ పర్యాటకుల తాకిడి తగ్గలేదు. వేసవి సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడ ఇసుక తిన్నెల్లో ఆటపాటలతో మునిగి తేలారు. తీరం కెరటాల్లో జలకాలాడి ఆనందించారు. దీంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. అయితే తీరానికి వచ్చే పర్యాటకులకు కనీస వసతి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఓపీ.. హ్యాపీ

పేదలకు ఏ విధంగా సేవ చేయాలి.. వారికి ఎలా మంచి చేయాలని ఆలోచించే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో అరుదైన సేవా విధానాన్ని పేద రోగుల అందుబాటులోకి తీసుకొచ్చింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలల్లో సాయంత్రం ఓపీ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వల్ల రోగులు ఉదయం ఓపీ చీటీ రాయించుకుని, వైద్యులకు చూపించుకుని, పరీక్షల అనంతరం సాయంత్రం మళ్లీ అదే వైద్యుల ద్వారా నిర్దేశించిన మందులతో ఇంటికి చేరుకుంటున్నారు. పనులన్నీ ఒకే రోజు పూర్తి కావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేదలంటే ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను వేనోళ్ల కొనియాడుతున్నారు.

- కేజీహెచ్, విక్టోరియా, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో ఈవెనింగ్ ఓపీ
- రోగులకు సంతృప్తికర సేవలు
- సాయంత్రం టెస్టు రిపోర్టులను పరిశీలించి మందులు సూచిస్తున్న వైద్యులు



పేదల ఆరోగ్యప్రదాయిని కేజీహెచ్

మహారాణిపేట (విశాఖ): కింగ్ జార్జి ఆస్పత్రిలో ఇప్పుడు ఈవెనింగ్ అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం ఓపీ టికెట్ తీసుకుని, వైద్యులకు చూపించే సరికి ఒక పూట గడిచిపోతుంది. వైద్యుల సూచన మేరకు వివిధ పరీక్షలు చేయించుకునే సరికి మధ్యాహ్నం అవుతుంది. దాంతో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. మళ్లీ అదే యూనిట్ ఓపీ వచ్చే సరికి వారం రోజులు పడుతుంది. ఇంతలో రోగం ముదిరిపోయి పరిస్థితులు దిగజారిపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం సాయంత్రం ఓపీ సేవలను అందుబాటులోకి తేవడం తమకెంతో మేలు చేస్తుందని పేదలంటున్నారు. ఉదయం ఏ యూనిట్ ఓపీ నిర్వహిస్తుందో.. సాయంత్రం కూడా అదే యూనిట్ వైద్యులు ఓపీ సేవలకు అందుబాటులో ఉంటున్నారు. ఈ నెల 17 నుంచి ఈ సేవలను అమలులోకి తెచ్చింది. గైనిక్, డెర్మటాలజీ, మెడిసిన్, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల ఓపీలు ఈ సేవలందిస్తాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. ఇటీవల అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో ఈవెనింగ్ క్లినిక్స్ ఏర్పాటుపై చర్చ జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బోధనాస్పత్రుల్లో అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ ఘోష ఆస్పత్రిలో..

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ ఘోష (విక్టోరియా) ఆస్పత్రిలో కూడా సాయంత్రం వేళ ఓపీ సేవలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ఓపీ సేవలందిస్తున్నారు. సిబ్బందికి డ్యూటీల్లో మార్పులు చేశారు. ప్రతి రోజు విజిహెచ్‌లో జరిగే ఓపీల్లో వైద్యులు రాసిన వివిధ పరీక్ష రిపోర్టును సాయంత్రం ఓపీ సమయంలో వైద్యులు పరిశీలించి మందులు రాయడానికి వీలు కలుగుతుంది. ఉదయం ఓపీలను, పాత ఓపీ టికెట్ కలిగిన వారికి మాత్రమే సాయంత్రం పూట వైద్యం అందిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు.



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల

ఈ ఆస్పత్రికి గర్భిణులు,బాలింతల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. రోజూ ఓపీకి 125 నుంచి 150 వరకు బాలింతలు,గర్భిణులు వస్తుంటారు. బుధవారం, శుక్రవారం రోజుల్లో రోజుకు 300 నుంచి 400 వరకు వస్తున్నారు.

ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో..

రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈవెనింగ్ ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఆ రోజు ఏ యూనిట్ వైద్యులు ఉంటారో అదే యూనిట్ వైద్యులు సాయంత్రం ఓపీ సేవలు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయింది



ద్విచక్రవాహనం మీద వెళ్తున్న నన్ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన కొద్ది రోజుల తర్వాత కేజీహెచ్ వైద్యులను సంప్రదించాను. వారు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇప్పుడు రాడ్డు తొలగించవలసి ఉంది. దాని కోసం ఈ రోజు ఈవెనింగ్ ఓపీకి వచ్చాను. వైద్యులు బాగా చూశారు. –కిల్లో మోహనరావు, తలబిరడ, ముంచంగిపుట్టు మండలం, ఏఎస్‌ఆర్ జిల్లా

గాయమైతే చూపించా..



రెండున్నరేళ్ల నా కుమారుడు జస్వంత్ రోడ్డు మీద పడిపోయాడు. చేయి వాచిపోయింది. వైద్యులకు చూపించాను. ఎక్స్‌రే రాశారు. సాయంత్రం ఓపీలో చూపించడానికి వచ్చాను. కట్టు కట్టాలని చెప్పారు. ఒడిశా నుంచి చుట్టం చూపునకు వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. – చంటిబాబు, ఒడిశా

బదిలీలపై ముమ్మర కసరత్తు..!

- ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలు విడుదల
- 17 దరఖాస్తుల తిరస్కరణ
- స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లపై మరోదఫా పరిశీలన
- తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే క్రిమినల్ చర్యలు
- 6,071 దరఖాస్తులకు ఆమోదం

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలపై విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వివిధ కేడర్లకు చెందిన 6,088 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలన మేరకు 17 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.లక్ష్మణరావు ఆదివారం వెల్లడించారు. దీంతో 6,071 దరఖాస్తులకు ఆమోదం లభించింది. కొంతమంది దరఖాస్తులను ఉపసంహరించుకోగా, మరికొంతమంది ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని వాటిని తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. కొన్ని కేడర్లకు సంబంధించిన ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ఆదివారం ప్రకటించారు. సోమవారం నాటికి పూర్తి స్థాయిలో అన్ని కేడర్ల సీనియార్టీ జాబితాలు ప్రదర్శించేలా విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

ఎస్.రాయవరం నుంచి అత్యధికం

ఉపాధ్యాయులకు మేలు చేయాలనే ఉద్దేశంతో జీరో సర్వీసుతో బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువగానే దరఖాస్తులు వచ్చాయి. సొంత గ్రామాలు, వాటికి సమీప పాఠశాలల్లో చోటు దక్కించుకోవడం కోసం ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం నుంచి అత్యధికంగా 258 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో నక్కపల్లి మండలం నుంచి 251 దరఖాస్తులు అందాయి. కాగా విశాఖపట్నం అర్బన్ నుంచి అత్యల్పంగా కేవలం 16 మంది మాత్రమే బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా పెదగంట్యాడ మండలం నుంచి 58, గాజువాక – 71, సబ్బవరం – 78, పెందుర్తి – 82 మంది దరఖాస్తు చేసుకున్నారు. విశాఖపట్నం నగరానికి సమీపాన ఉండడంతో ఇక్కడి నుంచి వేరేచోటకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి కనబరచలేదు.

తప్పిదాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలపై ఈ నెల 30న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిశీలించి, వాటిని పరిష్కరిస్తారు. ఈ ప్రకియే కీలకం కానుంది. ఈ ఏడాది జనవరిలో బదిలీల ప్రక్రియ నిర్వహించగా, కోర్టు కేసుల కారణాలతో దానిని రద్దు చేశారు. అయితే ఆ సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలింది. స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లు సమగ్ర పరిశీలనతో ఇది వెలుగులోకి వచ్చింది. ఇలాంటి వాటిని కట్టడి చేసే క్రమంలోనే ఈ సారి బదిలీల ఉత్తర్వుల్లోనే స్పష్టమైన విధి విధానాలను ఉన్నతాధికారులు వెల్లడించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టిన వారికి మూడు ఇంక్రిమెంట్లు కోత పెట్టడటంతోపాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసారి ఎంతమంది అయ్యవార్లు అడ్డదారులు తొక్కారనేది అభ్యంతరాల పరిశీలన అనంతరం తేలనుంది.

1,997 మందికి కంపల్సరీ బదిలీ

ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు, 8 ఏళ్లు పూర్తయిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో గ్రేడ్ – 2 హెచ్‌ఎం – 105 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు – 1,394 మంది, స్కూల్ అసిస్టెంట్లు – 498 మంది ఉన్నట్లు లెక్క తేల్చారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్న చోట నుంచి తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే.

క్లుప్తంగా

6న ఆలయ భూముల కౌలు వేలం

తుమ్మపాల: పట్టణంలో కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూములకు వచ్చే నెల 6న కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహక అధికారి కె.ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గొలగాం గ్రామంలో సర్వే నంబరు 264–1లో 2 ఎకరాలు, సర్వే నంబరు 112–8లో 2.90 ఎకరాలు, సర్వే నంబరు 212లో 2.32 ఎకరాలు భూములను ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి 2026 మే నెల 30వ తేదీ వరకు కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఒక్కొక్క విస్తీర్ణానికి రూ.3 వేలు ధరావత్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. హెచ్చు పాటదారు సంవత్సరం శిస్తు బయానాగా చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు, లక్ష రూపాయల సాల్వెన్సీ సర్టిఫికెటు దేవాలయానికి ఇవ్వాలన్నారు.

బీచ్ రోడ్డులో విటథాన్ రన్



రన్‌ను ప్రారంభిస్తున్న సుదీక్ష

బీచ్‌రోడ్డు(విశాఖ): రెటినా బ్లాస్టోమా కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో విటథాన్ రన్ నిర్వహించారు. 10,5,3 కిలోమీటర్ల కేటగిరీలో రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని రెటినా బ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను జయించిన బేబీ కోడెల సుదీక్ష జెండా ఊపి ప్రారంభించారు. ఈ క్యాన్సర్ వ్యాధి సోకిన రోగులకు ఉచితంగా చికిత్స అందించేందుకు నిధుల సేకరణలో భాగంగా ఈ రన్‌ను నిర్వహించినట్టు ఆస్పత్రి హెడ్ డాక్టర్ భవిక్ పంచాల్ తెలిపారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించగలిగితే పిల్లల జీవితాన్ని, కంటిని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కంటి క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ నేహా ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాబ్ధిరస్తు

- వేసవిలోనూ తగ్గని పాల దిగుబడి
- 77 దేశవాళీ ఆవుల నుంచి రోజూ 230 లీటర్ల వరకు సేకరణ
- ఏటా సాధిస్తున్న చిరికివానిపాలెం రైతు అచ్చింనాయుడు



చాప్ కట్టర్ ద్వారా గడ్డిని చిన్న ముక్కలుగా చేస్తున్న దృశ్యం



పశువులకు దాణా వేస్తున్న రైతు అచ్చింనాయుడు

కె.కోటపాడు: సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో 20 శాతం మేర పాల దిగుబడి తగ్గుతుంది. దీని ద్వారా వచ్చే ఆదాయం కోసుకుపోతుంది. పశుగ్రాస సమస్యతోపాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ పరిస్థితి పాడిరైతులకు ఎదురవుతోంది. ఇటువంటి పరిస్థితులను చిరికివానిపాలెం గ్రామానికి చెందిన రైతు లాలం అచ్చింనాయుడు సమర్థవంతంగా అధిగమిస్తూ.. అధిక పాల ఉత్పత్తి సాధిస్తున్నాడు.

6 రకాల మేలుజాతి గడ్డి పెంపకం

రైతు అచ్చింనాయుడు తనకున్న తొమ్మిది ఎకరాల్లో ఆరు రకాల మేలుజాతి గడ్డిని పశుగ్రాసంగా పెంచుతున్నాడు. కేరోటిన్ ఎరుపు, హనీపాట్, బీఎస్‌హెచ్–10, జెయింట్ నేపియర్, బర్సీమ్, ఎస్ఎస్‌జీ రకాల గడ్డిని పెంచుతున్నాడు. ఈ గడ్డిని నాటిన 40 రోజులకు కోతకు వస్తుంది. సేంద్రియ ఎరువులతో పెంచడం వల్ల ఎనిమిది నుంచి పదేళ్లపాటు దిగుబడి వస్తుంది. కోసిన గడ్డిని చాప్ కట్టర్‌తో చిన్న ముక్కలుగా చేసి ఒక్కో ఆవుకు రోజూ 20 నుంచి 25 కిలోలు పశుగ్రాసంగా అందిస్తున్నాడు. వీటితో పాటు మూడు నుంచి ఐదు కిలోల ఎండు గడ్డి, రోజూ టీఎంఆర్ పశుదాణా మేపుతున్నాడు. కొమ్ముశనగలు, మినుములు, బొబ్బర్లు, అలసంద, పెసలు, బఠానీ పొట్టు, తగినంత సైంధవ లవణంను కలిపి దాణాగా ఇస్తున్నాడు. సాధారణంగా వేసవిలో పశువులు ఎండకు తాళలేక నీరు ఎక్కువగా మేత తక్కువగా తింటాయి. ఈ కారణంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు పశువులకు అవసరమైన ఆహారాన్ని అందిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

వేసవిలో ఏమాత్రం తగ్గకుండా..



నేను 77 దేశవాళీ రకాలైన గిర్ జాతి ఆవులను పెంచుతున్నా. వీటిని ఎండ నుంచి రక్షించేందుకు పగటి వేళల్లో షెడ్‌ల్లోను, రాత్రిళ్లు ఆరుబయట చెట్లు కింద ఉంచుతున్నా. సాధారణ రోజుల్లో వీటి ద్వారా రోజూ 220 నుంచి 230 లీటర్ల వరకూ పాలు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం వేసవిలోనూ తీసుకుంటున్న జాగ్రత్తలతో ఏమాత్రమూ పాల దిగుబడి తగ్గలేదు. దాంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకుంటున్నా.

– లాలం అచ్చింనాయుడు, రైతు, చిరికివానిపాలెం

సరైనా జాగ్రత్తలతో పాల దిగుబడి



వేసవిలో పశుగ్రాస సమస్య రాకుండా రైతులకు ఇప్పటికే రాయితీపై కాకిజొన్న రకం గడ్డి విత్తనాలు, టీఎంఆర్ దాణాను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేశాం. ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 4 గంటల తర్వాత మేతకు పశువులకు ఆరుబయటకు తీసుకెళ్లాలి. నీటితో రెండు పూటలా వాటిని శుభ్రం చేయడం వల్ల ఉష్ణోగ్రత చల్లబడుతుంది. తద్వారా పాల దిగుబడి తగ్గకుండా చర్యలను తీసుకోవచ్చు.

–జి.బైరాగి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, కె.కోటపాడు

ప్రభుత్వోద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ జిల్లా చైర్మన్ వాసు, శ్రీరామ్మూర్తి

అనకాపల్లి టౌన్: ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నట్లు ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ సింగంపల్లి వాసు, కార్యదర్శి వై శ్రీరామ్మూర్తి తెలిపారు. స్థానిక నర్సింగరావుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఆదివారం వారు వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీ కమిషన్ రికమెండ్ చేసిన పే స్కేల్స్ జీవోను వెంటనే విడుదల చేయాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత పాదయాత్రలో ప్రకటించినట్లుగా సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, వీఆర్ఏలకు సంబంధించిన ప్రధాన సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్లను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు డి.లోవరాజు, పి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

చోడవరం రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం సీజ్ చేసినట్టు చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు చెప్పారు. జన్నవరం రహదారిలో బెన్నవోలు జంక్షన్ వద్ద తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా గౌరీపట్నం గ్రామానికి చెందిన కోన సురేష్ ఎటువంటి అనుమతులు లేకుండా బెన్నవోలు నుంచి జన్నవరం వైపు ట్రాక్టర్‌పై ఇసుకలోడు తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని చోడవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అదే విధంగా గౌరీపట్నం గ్రామానికి చెందిన బొబ్బిలి సంతోష్ ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు.

కాశీపురం జంక్షన్ వద్ద...

దేవరాపల్లి: శారదానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కాశీపురం జంక్షన్ వద్ద తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఇసుక లోడుతో రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

- లక్షల్లో ఆస్తి నష్టం
- నిబంధనలకు విరుద్ధంగా స్క్రాప్ దుకాణం నిర్వహణ
- విచారణ జరుపుతామన్న పోలీసులు



తుక్కు దుకాణంలో ఎగసిపడుతున్న అగ్నికీలలు

పరవాడ : పరవాడ సమీపంలో బ్యాంకు కాలనీ వద్ద ఏపీఐఐసీ స్థలంలో నడుపుతున్న తుక్కు దుకాణంలో ఆదివారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నావిద్‌బాయ్ 15 ఏళ్లుగా పరవాడ సమీపంలోని బ్యాంకు కాలనీ వద్ద గల ఏపీఐఐసీకి చెందిన స్థలంలో తుక్కు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జాము 3.30 గంటల సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పంటుకొని భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తుక్కు దుకాణంలో ఓ షెడ్డుకు అమర్చిన విద్యుత్ వైరింగ్‌లో లూజు కాంటాక్టు వల్ల షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రమాదంలో లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని ప్రాథమిక అంచనా. ప్రమాదాన్ని గుర్తించి కార్మికులు అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించడంతో వారొచ్చి మంటలను అదుపు చేశారు. అనకాపల్లి జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.లక్ష్మణమూర్తి, సహాయ అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావులు ఘటన స్థలాన్ని సందర్శించారు. ఫార్మా పరిశ్రమల నుంచి సేకరించిన ప్లాస్టిక్, రసాయనిక వ్యర్థాలు కావడంతో మంటలు అదుపు చేయడం భారంగా మారింది. రోజంతా శ్రమించి మంటలను ఆదివారం సాయంత్రంనాటికి అదుపులోకి తెచ్చారు. ఎటువంటి అనుమతులు లేకుండా తుక్కు దుకాణం నడుపుతున్నాడని, కేసు నమోదు చేసి విచారణ చేయనున్నట్టు పరవాడ సీఐ ఈశ్వరరావు చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తుక్కు దుకాణం యజమానిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

భారతదేశం విజ్ఞాన నిధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

కొమ్మాది : భారతదేశం విజ్ఞానాల నిధి అని కేంద్ర విదేశీ వ్యవహారాల ఇన్‌చార్జి డా.విజయ్ చౌతైవాలె అన్నారు. బీచ్ రోడ్డులో గల రాడిసన్ బ్లూలో రెండు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ ఆవిష్కరణ సృజనాత్మక సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారికి వ్యాక్సిన్ కనుక్కోవడం, యూపీఐ (యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) లావాదేవీల వల్ల ప్రపంచంలో మేటి దేశంగా నిలిచిందన్నారు. భారతీయ ఆవిష్కరణలను ఆయన విపులంగా వివరించారు. స్థానిక పరిష్కారాలను గ్లోబల్ సొల్యూషన్స్‌గా మార్చడానికి స్కేలింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఐఎన్ఎస్ఏ అధ్యక్షుడు అసుతోష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక స్వభావాన్ని పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అప్పుడే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్ఈ వ్యవస్థాపకురాలు డా.రూపావాసుదేవన్, చైర్మన్ భరత్ లాల్‌మీనా పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత ఎంతో అవసరం

- జిల్లా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గంటుబోయిన రవికుమార్
- యాదవ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన యాదవ సంఘం నాయకులు

యలమంచిలి: యాదవులు విద్యాపరంగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గంటుబోయిన రవికుమార్ అన్నారు. ఇటీవలే విడుదలైన 10వ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన 25 మంది యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఆదివారం యలమంచిలి పట్టణంలో ఎన్‌జీవోస్ కార్యాలయంలో యువ యాదవ జాగృతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందని, మధ్యాహ్న భోజనం పథకంలో సమూల మార్పులు తీసుకువచ్చి విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతోందని తెలిపారు. యాదవ విద్యార్థులు చదువులో ఏకాగ్రత పెంచుకొని ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని, అట్టడుగు వర్గాల్లో గల ప్రతిభా నైపుణ్యాన్ని గుర్తించి వారికి యువ యాదవ జాగృతి సంఘం ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేయడం హర్షించతగ్గ విషయమని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రజా ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, రెజాస్ రాష్ట్ర అధ్యక్షులు వియ్యపు ఉమాదేవి, పి.అప్పలరాజు, వెంకటేశ్వరావు, పల్లా మహేష్, మురుకుర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి ఆలయం ప్రధాన ద్వారం నుంచి గర్భగుడిలోకి వెళ్తున్న భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇక్కడ అమ్మవారి దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు వారి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

మహానాడు.. తలో దారి

పేటలో మరోసారి బయటపడ్డ టీడీపీ వర్గ పోరు

నక్కపల్లి: మహానాడు సందర్భంగా టీడీపీలో వర్గ పోరు మరోసారి బయటపడింది. పాయకరావుపేట నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు తలో దారిన రాజమండ్రిలో జరిగిన మహానాడుకు వెళ్లారు. పార్టీ శ్రేణులు అనిత అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. అనిత వ్యతిరేకవర్గానికి మాజీ మంత్రి గంట శ్రీనివాసరావు అండదండలు అందిస్తున్నారు. ఆ వర్గం వారంతా గంటా వాహనంతోపాటు మహానాడుకు వెళ్లడం గమనార్హం. పార్టీలో ప్రధాన వర్గం నేతలు అనితతో తీవ్రంగా విభేదిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆమె అభ్యర్థిత్వాన్ని అడ్డుకునేందుకు వీరు పావులు కదుపుతున్నారు. అనితకు బదులు కొత్తవారికి అవకాశం ఇచ్చేలా, జనసేనతో పొత్తు కుదిరే పక్షంలో టికెట్ ఆ పార్టీకి కేటాయించేలా చంద్రబాబును ఒప్పించేందుకు వ్యూహరచన చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, చెట్లు
- ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



చోడవరం-మైచర్లపాలెం రోడ్డులో ఈదురుగాలులకు విరిగిపడ్డ చెట్లు



చోడవరం-లక్ష్మీపురం రోడ్డులో ఈదురు గాలులకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

చోడవరం: ఎండలు మండుతున్న వేళ.. ఈదురుగాలులతో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం వరకు చోడవరంలో 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో భానుడు ఉగ్రరూపం దాల్చాడు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు వీచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అప్పటి వరకు ఎండ తీవ్రతతో వేడెక్కిపోయి ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇదేక్రమంలో ఈదురుగాలుల బీభత్సానికి చోడవరం-లక్ష్మీపురం రోడ్డులో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చోడవరం-మైచర్లపాలెం రోడ్డులో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు శిరుచోళ్ల గణపతినాయుడు, బూరే మాణిక్యం హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీల సాయంతో వాటిని పక్కకు తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. గాలులు, వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో జనం ఉపశమనం పొందారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం:

ఈదురుగాలు కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలడంతోపాటు మరికొన్ని చోట్ల తీగలపై చెట్లకొమ్మలు విరిగి పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చోడవరం పట్టణంతో పాటు అన్నవరం, లక్ష్మీపురం, మైచర్లపాలెం, దామునాపల్లి, గాంధీగ్రామం, నర్సయ్యపేట గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. విద్యుత్ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా ఆయా ప్రాంతాలకు సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి



గొలుగొండ: పిడుగుపాటుకు మృతి చెందిన పాడిగేదె

గొలుగొండ: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. గొలుగొండకు చెందిన ఎలమండ శ్రీరాములమ్మ పాడిగేదె పిడుగుపాటుకు మృతి చెందింది. ఎర్రవరం, చీడిగుమ్మల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పిడుగు పాటుకు గడ్డిమేటు దగ్ధం



రావికమతం: దగ్ధమవుతున్న గడ్డిమేటు

రావికమతం: కొత్తకోటలో పిడుగు పాటుకు గడ్డిమేటు దగ్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులు, పిడుగులతోపాటు వర్షం పడింది. గ్రామానికి చెందిన గుమ్ముడు బాబూరావు కల్లాల వద్ద గడ్డిమేటుపై పిడుగు పడి పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో పశువులు గానీ రైతులు గానీ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆటోను ఢీ కొట్టిన ఆవు

- ఆటో బోల్తా పడి ఆశ కార్యకర్త మృతి
- వివాహ విందుకు హాజరై వెళ్తుండగా ప్రమాదం
- బూదరాళ్లలో విషాదం



చేతికి గాయమైన చిన్నమ్మి



భార్య నాగమణి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త చంద్రరావు

కొయ్యూరు: మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో చెప్పలేమన్నది నిజమైంది. ఆమె తోటి వారితో కలిసి వివాహ విందుకు హాజరైంది. తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా మృత్యువు ఆవు రూపంలో వచ్చింది. దీంతో బూదరాళ్లలో విషాదం నెలకొంది. బూదరాళ్ల ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న కూనిశెట్టి నాగమణి(42) ఆదివారం మర్రివాడ పంచాయతీ దొడ్డవరంలో నిర్వహించిన వివాహ విందుకు హాజరై, తిరిగి బూదరాళ్లకు ప్రయాణమైంది. మర్రివాడకు సమీపంలో ఆటోలో వెళ్తుండగా అటు నుంచి వేగంగా వస్తున్న ఆవు ఆటోను బలంగా ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ ఆటోను నియంత్రించేందుకు ప్రయత్నించినా ఫలితం లేక బోల్తా పడింది. ఆటో చివరన కూర్చున్న నాగమణిపై ఆటో మొత్తం పడిపోయింది. దీంతో ఆమె గుండె వద్ద బలంగా గాయమై అక్కడే ఆమె కుప్పకూలిపోయింది. వెంటనే 108లో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్టుగా వైద్య సిబ్బంది నిర్ధారించారు. భార్య మరణించిన సమాచారం భర్త చంద్రరావుకు తెలియడంతో ఆయన భార్య మృతదేహంపై పడి బోరున విలపించారు. నాగమణికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వారంతా చదువుతున్నారు. అందరికీ సేవలు అందించే నాగమణి ఇక లేరన్న విషయం తెలుసుకున్న బూదరాళ్ల గ్రామస్తులు కంటతడి పెడుతున్నారు. ప్రమాదంలో ఓనంగి చిన్నమ్ములు చేతికి గాయమైంది. పాత్రూరు రాజుబాబు, ఇలపు సింహాద్రికి స్వల్ప గాయాలయ్యాయి.

మోకాళ్ల ఆపరేషన్లపై వైద్యులకు అవగాహన

ఎంవీపీకాలనీ: మోకాళ్ల ఆపరేషన్లపై వైద్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియన్ ఆర్థోస్కోపీ సొసైటీ (ఐఏఎస్) ఆధ్వర్యంలో నగరంలోని నోవోటెల్ హోటల్లో 'ఐఏఎస్ వన్ మోకాళ్ల ఆర్థోస్కోపీ' సదస్సు జరిగినట్లు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం తెలిపింది. ఈ సదస్సులో నిపుణులైన డాక్టర్లు సందీప్ బిరారిస్ (ముంబై), రాజీవ్ రామన్ (కోల్‌కతా), ముకేశ్ లద్దా (నాగపూర్), చిరాగ్ తోసే (బెంగళూరు)లు ఏసీఎల్, పీసీఎల్ మెనిస్క, మల్టీలిగమెంట్ మోకాళ్ల సర్జరీ విధానాన్ని వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 5 విభాగాలుగా విభజించి నిర్వహించిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ రింగ్‌పోల్స్‌కు విద్యుత్ లైట్లు అమర్చేందుకు ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఏడు నెలల క్రితం విద్యుత్ రింగ్‌పోల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. 35 జంక్షన్లలో 35 రింగ్‌పోల్స్‌కు 140 విద్యుత్ లైట్లు అమర్చవలసి ఉందని పేర్కొన్నారు.

కశింకోటలో చిరు జల్లులు

కశింకోట: మండలకేంద్రం కశింకోటలో ఆదివారం మధ్యాహ్నం చిన్నపాటి వర్షం కురిసి, వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. అనంతరం చిన్నపాటి వర్షం పడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. వీచిన గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జంపన


వెంకటసన్యాసిరావు

తుమ్మపాల: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జంపన వెంకటసన్యాసిరావు నియమితులైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సన్యాసిరావుకు ఆదివారం నియామక పత్రం అందినట్టు తెలిపారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు


ఆత్మీయ సమావేశమైన మిత్రులు

మునగపాక : ఇంటర్ చదువుకొని 20 ఏళ్ల పూర్తయిన తరువాత మిత్రులంతా ఆదివారం మండలంలోని వెంకటాపురం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విశాఖ డెయిరీ జూనియర్ కళాశాలలో 1999–2001లో ఇంటర్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. 20 ఏళ్ల క్రితం ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కర్రి లక్ష్మీనారాయణ, రాపేటి సత్యనారాయణ, చుక్కా గోపీ, ఆడారి రాధాకృష్ణ, దుర్గారావు, నాగేశ్వరరావు, గణేష్, సతీష్, మురళి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 409 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,640
రెండో రకం	4,000	4,400
మూడో రకం	3,600	3,940

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	-రాజా
రామబాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
2018	-షిర్డిసాయి
ఉగ్రం	-పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	-వెంకటేశ్వర
మళ్లీపెళ్లి	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, ఎ నెగిటివ్-1యూనిట్, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ :ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 251 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

కొత్త ఊళ్లు.. సంతోషాల లోగిళ్లు

బాడుగ ఇళ్లలో బాధలు తప్పుతున్నాయి.. అద్దె సొమ్ము ఇవ్వలేని అవమానకర పరిస్థితులు తొలగుతున్నాయి... గుండె గదుల్లో సంతోషాల పొంగులతో కొత్తగా కాపురాలకు శ్రీకారం చుడుతున్నారు.. ఎప్పటికైనా సొంతింటి కల తీరుతుందా అని కనులు కాయలు కాసే వారి కళ్ల ముందే ఆనంద లోగిళ్లు ఆవిష్కృతమవుతున్నాయి.. ఇప్పటికే జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు పూర్తి చేసి కొందరు గృహ ప్రవేశాలు చేయగా, మరి కొందరూ జోరుగా నిర్మాణాలు చేస్తుండడంతో పాటు సదుపాయాలు ఏర్పడడంతో కొత్త ఊళ్లు రూపుదిద్దుకుంటున్నాయి.


కశింకోటలోని వడ్డి వీధిలో ఉన్న వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

- గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్న జగనన్న లేఅవుట్లు
- పలు కాలనీల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు


లేఅవుట్‌లో ఇళ్లకు ఇచ్చిన ఉచిత విద్యుత్ కనెక్షన్ల మీటర్లు

కశింకోట: మండలంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో కాలనీలు ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రధానంగా కశింకోట, తేగాడ తదితర లేఅవుట్లలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు సాగుతున్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో 34 వైఎస్సార్ జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేశారు. 2,422 మందికి ఒక్కొక్కరికీ సెంటున్నర చొప్పున స్థలం మంజూరు చేశారు. 1,653 మందికి ఇళ్లు మంజూరు చేశారు. సొంత స్థలాలు ఉన్న మరో 459 మందికి కూడా గృహాలు మంజూరు చేశారు. ఇప్పటికే 800 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 200 ఇళ్లు జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశించారు. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి మండల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు లేఅవుట్లు

కశింకోటలో ఐదు లేఅవుట్లలో ఇళ్లు మంజూరు చేశారు. వడ్డి వీధిలో ఒకటి, గాడి వీధి, సత్తెమ్మ కాలనీలో రెండేసి లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటిలో వడ్డి వీధి లేఅవుట్ మండలంలోనే అతి పెద్దది. ఇక్కడ 312 మందికి స్థలాలు కేటాయించగా, 199 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 95 ఇళ్లు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మిగిలిన 104 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పెద్ద కుటుంబాల వారు రెండు అంతస్తులతో ఇళ్లు నిర్మించుకున్నారు. కొందరు గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు.

- తేగాడలో గల మరో పెద్ద లేఅవుట్‌లో కూడా ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. తేగాడతోపాటు చుట్టు పక్కల ఉన్న పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, జోగారావుపేట గ్రామాలకు చెందిన 242 మందికి ఒకేచోట స్థలాలు కేటాయించగా, వాటిలో 177 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికే 77 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. వీరిలో కొందరు గృహ ప్రవేశాలు చేసి, నివాసాలు ఉంటున్నారు.


వడ్డీ వీధి లేఅవుట్‌లో రెండు అంతస్తుల భవనాలు

- నూతలగుంటపాలెం, జి.భీమవరం, ఈ.చౌడువాడ, తీడ, గొబ్బూరు, తాళ్లపాలెం తదితర లేఅవుట్లలో వందకు పైగా ఇళ్లను మంజూరు చేయడంతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మిగిలిన లేఅవుట్లలో నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఉచిత విద్యుత్

వైఎస్సార్ కాలనీల్లో స్తంభాలు, లైన్లు వేసి విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తోంది. కుళాయిలు ఏర్పాటు చేశారు. లేఅవుట్లలో రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

సొంతింటి కల నెరవేరుతోంది



అద్దె ఇంటిలో చాలా కాలంగా ఉంటున్నాం. వడ్డి వీధి లేఅవుట్‌లో స్థలం ఇచ్చారు.ఇల్లు నిర్మించుకుంటున్నాం. పూర్తి అయితే సొంత ఇంటి కల నెరవేరుతుంది. ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
–నక్కా నరసింహమూర్తి, కశింకోట.

ఆనందంగా ఉంది



తేగాడలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్ ఒక గ్రామంలా తయారవుతోంది. ఆనందంగా ఉంది. ఇక్కడ ఐదు గ్రామాల లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. విద్యుత్, నీటి సదుపాయాలన్ని కల్పించారు. ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాం. ఇల్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
–గొర్లి సునీత, తేగాడ.

జోరుగా నిర్మాణాలు

మండలంలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 800 వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి కావచ్చింది. జులై నెలాఖరుకు మరో 200 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆ మేరకు లబ్ధిదారులను ప్రోత్సహించి నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. కశింకోట, తేగాడలోని దాదాపు సగం ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలిన చోట్ల కూడా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేసి, కొత్తగా దరఖాస్తు చేసిన వారికి కేటాయించడానికి చర్యలు చేపడతాం.
–వి. శ్రీనివాసరావు, ఏఈ, హౌసింగ్, కశింకోట

నేడు యలమంచిలిలో భారీ బైక్ ర్యాలీ

ర్యాలీ విజయవంతానికి వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు

యలమంచిలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు రాజధానిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం యలమంచిలి పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం గౌరవంగా తెత్తుకుని జీవించేలా ఇల్లు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశానవాటికలతో పోల్చి పేద ప్రజలను దారుణంగా అవమానించారని అన్నారు. టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉదయం 9 గంటలకు యలమంచిలి పట్టణంలో ఏఎస్ఆర్ కాలనీ నుంచి బోదెపు గోవింద్ పెట్రోల్ బంక్ , పట్టణంలో వైఎస్సార్ విగ్రహం కూడలి వరకు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యలమంచిలి వైయస్సార్‌సీపీ నాయకులు కోరారు.

బెలూన్లతో విన్యాసాలు


బెలూన్లతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు బెలూన్లతో చేసే వివిధ రకాల ఆకారాలపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా అచ్యుత స్కూల్ టీచర్ నర్సింగరావు విద్యార్థులకు బెలూన్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా మేధోశక్తి పెరగడంతో పాటు, అనేక కొత్త ఆలోచనలకు దారి తీస్తుందన్నారు. ముందుగా విద్యార్థులు బెలూన్లు చేతబట్టి స్వాగతం పలికారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ


సత్తెమ్మతల్లి అమ్మవారి దర్శనానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు


సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కాలనీవాసులంతా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకొన్నారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

430 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 430 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా 107వ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించింది. 322 మందికి కళ్లద్దాలు, 70 మందికి మందులు పంపిణీ చేశారు. 46 మందికి కాటరాక్ట్ సర్జరీలు అవసరమని వైద్యులు సూచించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన ఏర్పాట్లు చేశారు. శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరిశీలించారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి


రెడ్ ఛాలెంజ్ సింబల్ చూపుతున్న మహిళలు


మహిళా ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య అవగాహన సదస్సు

యలమంచిలి : రుతుక్రమం సమయంలో మహిళలు అపోహలు వీడనాడి ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమా కుమారి అన్నారు. ఆదివారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత రోజును పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో యలమంచిలి మెప్మా కార్యాలయంలో మహిళలకు ఉచిత ఆరోగ్య సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ మహిళలు రుతుక్రమం సమయంలో ఉండే ఇబ్బందులు సమస్యలు ఎవరికీ చెప్పలేకపోతున్నారని, ఈ నిశ్శబ్దాన్ని మహిళలు ఛేదించేందుకు ఏటా మే 28వ తేదీన అంతర్జాతీయ రుతుక్రమం దినోత్సవం ద్వారా మహిళల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో ప్రేరణ కల్పించడం జరుగుతోందని అన్నారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సమస్యలపై మహిళలు ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని, ఏఎన్ఎంల పర్యవేక్షణ తీసుకోవాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. ఈ సందర్భంగా రెడ్ ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెచ్‌బి టెస్ట్‌లు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, డాక్టర్ గౌతమి, మెప్మా సిఎంఎం పద్మావతి, మెప్మా సిబ్బంది రమాదేవి, సత్య, కృష్ణవేణి, డ్వాక్రా మహిళలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


జగనన్న కిట్లను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సంక్షేమానికి మారుపేరుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని, ఆయన పేదల పక్షపాతి అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, మెహర్‌బాబా, జీవీ కోటేశ్వరావు వీధుల్లో 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అధ్యక్షతన ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సరిపోతాయా ? లేదా ఇంకా కొన్ని పథకాలు కావాలా ? అంటూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనతీరు గురించి స్థానికులను అడిగారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. గతంలో పలు హామీలిచ్చి కనీసస్థాయిలో అమలు చేయని టీడీపీ నాయకులు మళ్లీ మీ ముందుకు ఓట్ల కోసం వస్తున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చంద్రబాబును ఏ మాత్రం నమ్మినా రాష్ట్రం నాశనమతుందున్నారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని చంద్రబాబు నాటకం ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. అమరావతిలో పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం అందజేస్తే.. చూసిన చంద్రబాబుకు మతిభ్రమించిందన్నారు. చంద్రబాబు ఏం మాట్లాడుతున్నారో తెలియక టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎవరితో ఎలా పొత్తుపెట్టుకోవాలో తెలియని అయోమయంలో పవన్‌కల్యాణ్ ఉన్నారని తెలిపారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి వద్ద మంత్రిగా పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆ ఆనందం నియోజకవర్గ ప్రజల వల్లే దక్కిందని చెప్పారు. పలువురు రహదారి, విద్యుత్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పదిరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నర్సింగరావుపేటలో జగనన్న విద్యాకానుక కిట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ జి.రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ కార్యదర్శి కుండల రామకృష్ణ, మండల కార్యదర్శి సీటిపల్లి శోభ, పార్టీ నేతలు మునూరి శ్రీనివాసరావు, దంతులూరి శ్రీధర్‌రాజు, గైపూరి రాజు, పలకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నతశిఖరాలకు..


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో రత్నాకర్, కార్పొరేటర్ లక్ష్మీసౌజన్య

అనకాపల్లిటౌన్: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్‌పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పదోతరగతి పరీక్షాఫలితాల్లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక దేమునిగుమ్మం సుంకర కల్యాణమండపంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీటవేస్తున్నారని, అమ్మ ఒడి, విద్యాదీవెన ద్వారా పేదవిద్యార్థులకు సహకారం అందిస్తున్నారని చెప్పారు. అనంతరం పదోతరగతి పరీక్షాఫలితాల్లో పట్టణంలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన దోసూరి హస్విత, పూడి పూర్ణిమ, నరవ దీక్షితలకు రూ.3వేల చొప్పున అందజేశారు. మంచి మార్కులు సాధించిన ఎనిమిదిమంది విద్యార్థులను దుశ్శాలువాలతో సత్కరించారు. సంఘం ప్రతినిధి గంగలకుర్తి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పి.రాంబాబు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి


ఎన్టీ రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాడి వీరభద్రరావు

తుమ్మపాల: సినీ, రాజకీయ రంగాల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి ఎన్టీ రామారావు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. ఎన్టీ రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా తన నివాసంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీరభద్రరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యులుగా ఉన్న ఎన్టీఆర్‌ను అప్పట్లో తీవ్రంగా విమర్శించిన పలువురు ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా శ్లాఘిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కౌన్సిల్ అధ్యక్షుడు కర్రి దివాకర్‌రావు , వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఎన్టీ రామారావుతో ఉన్న అనుబంధాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగి దొరబాబు, దాడి కృష్ణ, విల్లూరి రాము, బొడ్డపాటి రాజారావు, మెల్లి వెంకటరమణ, గుండ్రెళ్ళ కన్నారావు, ఇంటి సూరిబాబు, భీశెట్టికృష్ణఅప్పారావు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఉన్న ఎన్టీ రామారావు, బసవరామతారకంల విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ సతీమణి విజయలక్ష్మి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నరసింగబిల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు, అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మునగపాక పరిపాలనాధికారి రవికుమార్‌కు పదోన్నతి

మునగపాక : మునగపాక మండల పరిషత్ పరిపాలనాధికారి రవికుమార్‌కు పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి 93మంది ఈవోపీఆర్డీలు అలాగే 112 మంది పరిపాలనాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మునగపాక మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న రవికుమార్‌కు ఎంపీడీవోగా పదోన్నతికల్పించారు.

వాహనాల అతివేగం నియంత్రించాలి


మునగపాకలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మునగపాక : అధికలోడు, అతివేగంతో వచ్చే వాహనాలను నియంత్రించాలని కోరుతూ ఆది వారం మునగపాకలో ఆందోళన నిర్వహించారు. పూడిమడక రోడ్డులో నిత్యం భారీ వాహనాలు పరిమితికి మించి రాకపోకలు సాగించడాన్ని నిరసిస్తూ పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు శ్రీనివాసరావు, బ్రహ్మాజీ మాట్లాడుతూ పూడిమడక రోడ్డులో రాత్రి, పగలు తేడా లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో ప్రస్తుతం ఉన్న రహదారి శిథిలావస్థకు గురైందని అన్నారు. పరిమితికి మించి వేగంతో వాహనాలు నడుపుతున్నారని, దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఆందోళనకు గురవుతున్నారన్నా రు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు దాడి సాంబశివ, శరగడం జగన్, వేగి కుమార్, కర్రి వాసు, ఆడారి గోపి పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

రాంబిల్లి : రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను రాయితీపై అందజేస్తున్నామని ఏవో సి.సుమంత తెలిపారు. రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో నేలకు సారం లభిస్తుందని, రసాయన ఎరువుల ఖర్చు తప్పుతుందన్నారు.